ఆ కళ్ళజోడుని నాకు పంపిన ఆ పవిత్రాత్మకి నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తూ ఈ పాటని మొదలుపెడుతున్నాను."

ఆ మాటలు వినగానే తన కళ్ళజోడుని పోగొట్టుకున్న వడ్రంగి కళ్ళు చెమర్చాయి.

## 62. సాధువు-దొంగ

ఓ గ్రామం పక్కనే ఉన్న కొండ గుహలో ఓ సాధువు తపస్సు చేసుకునేవాడు. గ్రామస్థులే అతనికి నిత్యం భోజనం పెట్టేవారు. కొందరు అతనికి ధనాన్ని కూడా ఇచ్చేవారు.

ఓ రోజు ఆ సాధువు ధ్యానంలో ఉండగా ఓ దొంగ కత్తితో వచ్చి దాన్ని ఝుళిపిస్తూ అడిగాడు.

"ఓ ముసలోడా! నీకు భక్తులు ఇచ్చిన డబ్బంతా ఎక్కడ దాచావో చూపించు. లేదా నిన్ను చంపుతాను."

"నీకు అంత శ్రమ అవసరం లేదు. ఆ మూల కుండలో నువ్వు ఆశ పడే ధనం ఉంది." నవ్వుతూ జవాబు చెప్పాడు సాధువు.

దొంగ ఆ కుండకి ఉన్న మూతని తీసి చూస్తే దాన్నిండా అనేక బంగారు నాణాలు కనిపించాయి. ఆ కుండని ఎత్తి నెత్తిన పెట్టుకుని వెళ్తున్న ఆ దొంగతో చెప్పాడు సాధువు.

"జాగ్రత్తగా తీసుకెళ్ళు నాయినా. కుండ పగిలితే నాణాలని నువ్వు ఇంటికి తీసుకెళ్ళడం కష్టం."

"నాకు తెలుసులే." విసురుగా జవాబిచ్చాడు ఆ దొంగ.

"కృతజ్ఞతలు చెప్పకుండా వెళ్ళడం ధర్మం కాదు."

దొంగ ఆ సాధువుకి కృతజ్ఞతలని విసుగ్గా చెప్పి వెళ్ళిపోయాడు. కొద్ది దూరంలోనే కుండతో వెళ్ళే ఆ దొంగ, అడవికి కట్టెలని కొట్టుకోడానికి వచ్చిన కొందరు గ్రామస్థుల కంట పడ్డాడు. వాళ్ళు అతన్ని పట్టుకుని కుండలో చూస్తే జరిగింది వారికి అర్థమైంది. అతన్ని ఆ సాధువు దగ్గరకి తీసుకువచ్చారు.

"అదేమిటి? మీ ధనం ఉన్న కుండని దొంగ దొంగిలించాక మా దగ్గరకి వచ్చి ఎందుకు చెప్పలేదు? మేం వాడిని తక్షణం పట్టుకునే వాళ్ళం కదా? మేం చూడకపోతే తప్పించుకుని పారిపోయేవాడు?" ఆ గ్రామస్థులు అడిగారు.

"లేదు నాయనా. ఆ కుండని నేనే అతనికి ఇచ్చాను తప్ప వాడు దొంగతనం చేయలేదు. తన కృతజ్ఞతలని కూడా నాకు తెలియచేసి వెళ్ళాడు. కాకపోతే అతని దగ్గర ఓ కత్తి ఉంది. కాని ఆ కత్తి కన్నా వాడి నాలుక పదును. అంతే. వాడ్ని వదిలిపెట్టండి." కోరాడు సాధువు.

ఆ రోజు నించి ఆ దొంగ దొంగతనాలని మానేసి ఆ సాధువుకి శిష్యుడై ఆయనకి సేవ చేస్తూ ఆయన దగ్గరే ఉండిపోయాడు.

## 63. శిథిలాలయం

తమ రాజ్యానికి ఓ గొప్ప చిత్రకారుడు వచ్చాడని తెలుసుకున్న ఓ రాజు అతన్ని పిలిచి తన రాజ్యంలో శిథిలమైపోయిన ఓ దేవాలయం బొమ్మని గీయమని కోరాడు. అందుకు చిత్రకారుడు ఒప్పుకున్నాడు. తనకి కొన్ని వారాల సమయం కావాలని కోరాడతను.

అతను దేశం అంతా తిరిగి అలాంటి దేవాలయం కోసం వెదకసాగాడు. చివరకి ఒకటి చూసి తృప్తిపడ్డాడు. దాని ఎదురుగా వున్న ఓ చెట్టు నీడలో కూర్చుని అతను ఏకాగ్రతగా ఆ దేవాలయం చిత్రాన్ని గీయసాగాడు. అతని పనిని భంగపరిచేవారు ఎవరూ లేకపోవడంతో పది రోజుల్లో ఆ చిత్రాన్ని పూర్తి చేసేసాడు.

వెంటనే రాజధానికి బయలుదేరి రాజుగారికి చిత్రం పూర్తయిన సంగతి విన్నవించాడు. రాజుగారు ఉత్సాహంగా దాన్ని చూపించమన్నాడు. చిత్రకారుడు దాని తెర తీయగానే అందరి చూపులూ ఆ చిత్రం మీద పడ్డాయి. కొందరు పిచ్చి మొక్కలు మొలిచిన గోడలున్న ఆలయాన్ని వూహిస్తే, మరికొందరు కూలిపోతున్న గోడలని వూహించారు.

ఆ చిత్రాన్ని చూడగానే వెంటనే అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.